


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

గురువారం 24-7-2025

సంపుటి: 21 సంచిక: 104
పేజీలు: 8 వెల: రూ.1

## ఆస్తిపన్నులు ఎందుకు తగ్గుతున్నాయ్?

### - నగరంలో తనిఖీలు నిర్వహించిన రీజనల్ డైరెక్టర్ -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రతీ ఏడాది పెరగాల్సిన ఆస్తిపన్ను కొన్నిచోట్ల తగ్గుతుండాన్ని గ్రహించిన ప్రభుత్వం స్థానిక సంస్థల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు లేదా మున్సిపల్ యంత్రాంగం సొమ్ములు తీసుకొని పన్నులు తగ్గించేస్తుందేమోనన్న కోణంలో క్షేత్రస్థాయి పరిశీలన మొదలుపెట్టింది. ఇందులో భాగంగా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ వి.రవీంద్ర గురువారం నగరంలో కమిషనర్ దుర్గాప్రసాద్‌తో కలిసి ఇటీవల కాలంలో గతం కంటే తగ్గిన ఆస్తి పన్ను భవనాలను పరిశీలించారు. గతంలో కంటే ఆస్తి పన్ను ఎందుకు తగ్గించారంటూ ఆరా తీశారు. ఆస్తిపన్ను తగ్గిన మాట వాస్తవమేనని, కానీ ఒకే ఆస్తి రెండు వాటాలుగా వారసత్వంగా విభజించుకున్న తర్వాత సగానికి మాత్రమే పాత ఎసెస్‌మెంట్ మేరకు పన్ను ఉందని, అదేవిధంగా మిగిలిన సగం కొత్త ఎసెస్‌మెంట్లలో చేరిందని వివరించారు. స్థానిక జీటీ రోడ్డులో ఉన్న బాలాజీ లాడ్జి మేడపైన సెల్‌ఫోన్ టవర్‌తో పాటు భవనానికి గతంలో ఆస్తిపన్ను విధించారు. ఆ తర్వాత టవర్‌కు వేరేగా పన్ను విధించడంతో రూల్ పొజిషన్‌ను ఆర్డీ పరిశీలించారు. అలాగే కమర్షియల్ భవనం కింద పన్ను చెల్లించి, ఇప్పుడు రెసిడెన్షియల్ కింద మార్చేసి పన్ను తగ్గించిన భవనాలను కూడా ఆర్డీ పరిశీలించారు. ఆ విధంగా శ్రీకాకుళంలో 65 భవనాలు ఉన్నట్టు కమిషనర్ దుర్గాప్రసాద్ ఆర్డీకి వివరించారు. ఇందులో కొన్నింటిని పరిశీలించి ఆర్డీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉమామహేశ్వరరావు, నరేష్ ఉన్నారు.

## గోవా గవర్నర్‌ను కలిసిన హోటల్ అసోసియేషన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



గోవా గవర్నర్‌గా నూతనంగా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజును శ్రీకాకుళం హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం విజయనగరంలో కలిసి అభినందించారు. రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెట్ట నాగరాజు నేతృత్వంలో జిల్లా హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు అరసవల్లి సూర్యనారాయణ స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. గవర్నర్‌ను కలిసినవారిలో నాగావళి ఆనంద్, ఎస్‌వీడీ వినోద్, జేఎంఆర్ రాజా, గజపతి కేటరింగ్స్ సుదర్శన్, ట్రాఫిక్‌జామ్ శ్రీను తదితరులు ఉన్నారు.

# ఎరువే కరువయ్యేనా?





- ప్రభుత్వ కోటాలో సరఫరా వద్ద ఘర్షణ పడుతున్న రైతన్నలు
- ఇలా వచ్చి అలా మాయమైపోతున్న బస్తాలు
- వ్యవసాయ శాఖ మంత్రి చెప్పినా దక్కని ఊరట
- చేతులెత్తేసిన అధికారులు
- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్‌తో సరి
- ఎప్పటిలాగే దోచేస్తున్న ప్రైవేటు డీలర్లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పొందూరు మండలం దల్లిపేట గ్రామ సచివాలయానికి రావాల్సిన ఎరువులు నేరుగా ఓ ఫామ్‌హౌస్‌కు వెళ్లిపోయి, అక్కడి నుంచి ప్రైవేటు వ్యక్తుల చేతికి తరలిపోయిందంటూ స్వయంగా గ్రామ సర్పంచే సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు.

సరుబుజ్జిలి మండలం రొట్టవలస గ్రామ సచివాలయం వద్ద 245 యూరియా బస్తాలు పంపిణీ చేస్తామని అధికారులు ప్రకటించడంతో పెద్ద ఎత్తున అక్కడకు చేరిన రైతులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. వివక్ష లేకుండా అందరికీ పంపిణీ చేయాలని, అలా కాకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం కోసం కొందరికి ఎక్కువ బస్తాలిస్తున్నారంటూ బుధవారం గొడవ చేశారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.

కొత్తూరు మండల కేంద్రంలో ఎరువులు అందడం లేదంటూ మండల వ్యవసాయాధికారి కార్యాలయాన్ని నాలుగు రోజుల క్రితం రైతులు ముట్టడించారు.

..ఇదీ స్థూలంగా జిల్లాలో ఎరువుల కొరత కోసం వేరేగా చెప్పనక్కర్లేకుండా వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల సారాంశం. యూరియా ఏమైనా అందరూ తినే వస్తువా? లేదూ అంటే ఏమాత్రం ఈ భూమి మీద దొరకని పదార్థమా? ఎందుకింత రచ్చ జరుగుతుంది? అది కూడా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో?



ఎరువు లేకపోతే అరువు తెచ్చుకుందాంరా బుజ్జీ అని అతడు సినిమాలో బ్రహ్మీజీని ఉద్దేశించి తనికెళ్లభరణి అన్నట్టు అరువు తెచ్చుకుందామన్నా కూడా దొరకడం లేదు. స్వయంగా అచ్చెన్నాయుడే జిల్లాలో ఒక్క రైతు కూడా తమకు ఎరువులు అందడంలేదని ఫిర్యాదు చేయకూడదని వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పేర్కొన్నారు. అయితే పరిస్థితిలో మార్పు వచ్చిందా? లేదా? అనేదే ఈ కథనం. సూటిగా చెప్పాలంటే అచ్చెన్నాయుడు చెప్పిన తర్వాత కూడా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాలేదు.

జిల్లాకు సరఫరా చేసే ఎరువుల్లో 50 శాతం ప్రైవేట్‌కు, 50 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా రైతుసేవా కేంద్రాలకు, పీఏసీఎస్, మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. డిమాండ్‌కు తగ్గ - మిగతా చివరి పేజీలో






# భారత్‌పై చైనా వాటర్ బాంబ్!

- -బ్రహ్మపుత్ర నదిపై అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు
- -హిమాలయ ప్రాంతంలో జీవవైవిధ్యానికి ముప్పు
- -సరిహద్దు రాష్ట్రాల్లో వరదలు, కరువు సృష్టించే ఆయుధం
- -ఈశాన్య భారతం, బంగ్లాదేశ్‌లో లక్షలాదిమంది జీవనానికి దెబ్బ
- -ద్వైపాక్షిక ఒప్పందాలు లేకపోవడంతో ఇష్టారాజ్యం

'యుద్ధంలో గెలవడమంటే.. ప్రత్యర్థిని చంపడం కాదు' అని అంటారు. దాన్నే మరోవిధంగా ఆచరణలో చూపిస్తోంది మన పొరుగు దేశం చైనా. యుద్ధమంటే విమానాలతో బాంబులు, క్షిపణులు వేయడం.. శత్రు భూభాగాల్లోకి చొరబడి విధ్వంసం, వినాశనం సృష్టించడం, ఆక్రమించుకోవడం సంప్రదాయ పద్ధతి. కానీ ఇవేవీ చేయకుండానే శత్రువును ప్రమాదం అంచుల్లోకి నెట్టేయడం, అతని వనరులన్నీ నాశనం చేసి కకావికలం చేయడం ఆధునిక యుద్ధరీతి అని చైనా భావిస్తోంది. దాన్నే ఆచరణలో పెడుతోంది. భారత సరిహద్దుల్లో నిరంతరం చొరబాట్లు ప్రోత్సహించి ఉద్రిక్తతలు రేపడం.. అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం వంటి భారత రాష్ట్రాల్లోని ప్రాంతాలను పేర్లను మార్చేసి, వాటిని తమ ప్రాంతాలుగా మ్యాపుల్లో చూపించడం, మానవ రహిత ప్రాంతాలు(నో మ్యాన్ ల్యాండ్స్)గా ఇరుదేశాలు గుర్తించి చేసుకున్న ఒప్పందాలను మీరి సైనిక శిబిరాలు ఏర్పాటు వంటి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న చైనా ఇప్పుడు బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం ద్వారా భారత్‌పై అతిప్రమాదకరమైన వాటర్ బాంబ్ ప్రయోగానికి సిద్ధమవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యుత్ ప్రాజెక్టును వాటర్ బాంబ్‌గా ఎందుకు అభివర్ణిస్తున్నారు? దానివల్ల జరిగే నష్టం ఏమిటి?? ఒక పరిశీలనాత్మకం కథనం.

(డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి)

పొరుగునే ఉంటూ నిరంతరం భారత్‌కు పక్కలో బల్లెంలా వ్యవహరిస్తున్న చైనా మరోసారి అటువంటి చర్యలతో ఆందోళనకు గురిచేస్తోంది. తన కుయుక్తులను కొనసాగిస్తోంది. ఎవరూ ఎత్తిచూపలేని విధంగా అప్రకటిత యుద్ధం చేస్తూ భారత సరిహద్దు రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలిగించే దుశ్చర్యలకు తెరతీసింది. చైనా చర్యలు ఒక్క భారతదేశాన్నే కాకుండా బంగ్లాదేశ్‌కు సైతం తీవ్ర నష్టం కలిగిస్తాయి. హిమాలయాల్లో పుట్టి మూడు దేశాలగుండా ప్రవహిస్తూ కొన్ని లక్షలమందికి జీవనాధారంగా ఉన్న బ్రహ్మపుత్ర నదిపై ఏకపక్షంగా హైడ్రో ఎలక్ట్రిక్(జలవిద్యుత్) ప్రాజెక్టు నిర్మాణాన్ని చైనా పాలకులు తలపెట్టారు. ఈ పనులకు - మిగతా 4లో

• ఎడిటోరియల్

# రాజకీయ చదరంగంలో వ్యవస్థలే పావులు

రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్.. పేరుకు వీటిని గౌరవనీయ పదవులని అంటున్నా.. వాస్తవానికి ఇవి అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థలు. అందుకే రాష్ట్రపతిని దేశ ప్రథమ పౌరుడని, ఉప రాష్ట్రపతిని ద్వితీయ పౌరుడని అంటారు. అలాగే ఒక రాష్ట్రానికి రాజ్యాంగ అధిపతిగా ఉండే గవర్నర్‌ను రాష్ట్ర ప్రథమ పౌరుడిగా పరిగణిస్తారు. దేశ భవిష్యత్తు గురించి ఎంతో ఆలోచించి.. ఎన్నికల ద్వారా ఎన్నికయ్యే ప్రభుత్వాల్లో అనుచితంగా జోక్యం చేసుకోకుండా.. అలాగని ప్రభుత్వాలు హద్దులు మీరి ప్రవరిస్తుంటే వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తుంటే చూస్తూ ఊరుకోకుండా తగిన చర్యలు తీసుకునే అధికారం కల్పిస్తూ ఈ వ్యవస్థలను రాజ్యాంగ నిర్మాతలు ఏర్పాటు చేశారు. కానీ కాలక్రమంలో మన ప్రజాస్వామ్యం పక్కదారి పడుతున్నట్లే ఈ వ్యవస్థలు కూడా పతనం అవుతున్నాయి. ఈ పరిస్థితికి ప్రభుత్వాలను నడుపుతున్న పాలక పార్టీలే కావడం విచారకరం. అయితే ఇంతవరకు గవర్నర్లనే తమ తాబేదార్లుగా కేంద్రంలోని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయని విమర్శలు ఉన్నాయి. దాంతో ఆ పదవి ఔన్నత్యం, విలువ పతనావస్థలోకి పడిపోయాయి. అయితే నిన్న గాక మొన్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ హఠాత్తుగా రాజీనామా చేయడం వెనుక పాలక పార్టీ రాజకీయమే కారణమని స్పష్టమైంది. దాంతో గవర్నర్ల వ్యవస్థకు ఉప రాష్ట్రపతి పదవి కూడా రాజకీయ ఫంకిలంలో చిక్కుకుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. విశేషమేమిటంటే.. ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ అంతకుముందు పశ్చిమబెంగాల్ గవర్నర్‌గా ఉన్నారు. గవర్నర్ అనగానే రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత ఉన్న రాజ్యాంగ వ్యవస్థగా అందరూ భావిస్తారు. అయితే వెనకటి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ ఊహను తలకిందులు చేసి గవర్నర్ వ్యవస్థను రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడం ప్రారంభించాయి. చరిత్రలో అటువంటి ఉదంతాలు బోలెడు కనిపిస్తాయి. దశాబ్దకాలానికిపైగా అధికారంలో ఉన్న ఎన్డీయే హయాంలో ఆ వ్యవస్థను ఏమైనా గౌరవిస్తున్నారా అంటే అవునని చెప్పలేని పరిస్థితి. రాజమార్గంలో బాహాటంగానే.. ఇంకా చెప్పాలంటే గవర్నర్ పదవిని కొత్తగా నిర్వచించదలచుకున్నట్లు వ్యవహరిస్తోంది. ఆ క్రమంలోనే రాజ్‌భవన్లు రాజకీయ భవన్‌లుగా మారుతున్నాయన్న విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇదే ధన్‌ఖడ్ బెంగాల్ గవర్నర్‌గా ఉన్నప్పుడు అక్కడ ఎన్నికల ద్వారా ఏర్పడిన మమతాబెనర్జీ సర్కారు పట్ల వ్యవహరించిన తీరు.. అనుసరించిన ఘర్షణాత్మక వైఖరి.. రాజ్‌భవన్ సమాంతర ప్రభుత్వం నడుపుతోందన్న విమర్శలకు గురైంది. ఇదంతా కేంద్రంలోని ఎన్డీయే సర్కారు వ్యూహం, దన్నుతోనే చేశారన్నది బహిరంగ రహస్యం. గవర్నర్ వ్యవస్థను విమర్శల పాల్జేసిన ధన్‌ఖడ్ వంటి వ్యక్తికి ఎన్డీయే సర్కారు ప్రమోషన్ ఇచ్చి ఉప రాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టింది. అంటే ప్రజలు ఎన్నుకున్న ఒక రాష్ట్ర ప్రభుత్వాన్ని ముప్పుతిప్పలు పెట్టిన ఆయనగారి తీరు కేంద్ర నాయకత్వానికి ఎంత బాగా నచ్చిందో అర్థం చేసుకోవచ్చు. ఎద్దైనా తన దాకా వస్తే గానీ తెలియదంటారు. దాన్నే నిజం చేస్తూ ఇప్పుడు ధన్‌ఖడ్ వంతు వచ్చింది. కేంద్ర పెద్దల ఆలోచనకు భిన్నంగా వ్యవహరించిన పాపానికి నాడు మమత సర్కారు ఎదుర్కొన్న క్షోభనే ఇప్పుడు ఉప రాష్ట్రపతి వంటి అత్యున్నత హోదాలో ఉన్నా కూడా ధన్‌ఖడ్ ఎదుర్కోక తప్పలేదు. గవర్నర్‌గా చూపిన వ్యవహారశైలినే ఉపరాష్ట్రపతి హోదాలోనూ కొనసాగించారు. సుప్రీంకోర్టు అధికార పరిధిని ప్రశ్నించడంతో సహా రకరకాల వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. అది కాస్త వికటించింది. రాజ్యసభ చైర్మన్‌గా ఆపరేషన్ సింధూర్‌పై మాట్లాడే అవకాశం మొదటగా ప్రతిపక్ష నాయకుడికి ఇవ్వడం, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి వ్యతిరేకంగా ప్రతిపక్షం ఇచ్చిన అభిశంసన తీర్మానాన్ని స్వీకరించడం వంటి పరిణామాలు అధికార కూటమి కన్నెర్రకు, ధన్‌ఖడ్ రాజీనామాకు కారణమయ్యాయి. తెరచాటు కారణాలు ఎలాంటివైనా తెరముందు జరిగింది మాత్రం స్పష్టంగా, సందేహానికి తావులేకుండా కనిపిస్తూనే ఉంది. ఈ పరిణామాలు ఉప రాష్ట్రపతి అనే వ్యవస్థపైనా, రాజ్యసభ చైర్మన్ అనే దాని అనుబంధ వ్యవస్థపైనా నీలినీడలు కమ్ముకుని పతన సంకేతాలనిస్తున్నాయి. పాలక పార్టీల రాజకీయ చదరంగంలో ఒకదాని తర్వాత ఒకటిగా రాజ్యాంగ పదవులు, వ్యవస్థలు పావులుగా మారి బలైపోతుండటం ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల పతనానికి నిదర్శనం. ఇది అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు క్షేమదాయకం కాదు.



ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిణామాల పట్ల ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి గురువారం భేటీ అయ్యారు. దీనిలో భాగంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం**



నిత్యఅన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు కటకం వంశీకృష్ణ, వినయ్‌కుమార్‌ల పుట్టిన రోజు సందర్భంగా నానమ్మ తాతయ్య నాగేశ్వరరావు, కృష్ణ తులసి, తల్లితండ్రులు శ్రీనివాసరావు, మోహన్‌శ్రీ ఆధ్వర్యంలో గురువారం 35మందికి అన్నదానం, మజ్జిగ బాటిల్స్, మిఠాయిలు పంచిపెట్టారు. **– సత్యంన్యూస్, ఆమదాలవలస**

## తోపుడు బండి వ్యాపారికి ఆర్థిక సాయం

**(సత్యంన్యూస్, టెక్కలి)**

టెక్కలి మండలం స్థానిక ఆదిఆంధ్ర వీధిలో నివాసం ఉంటున్న దేవాది శ్రీనివాసరావు అనే వ్యక్తి రైల్వే గేట్ సమీపంలో తోపుడు బండి పై ఫ్రూట్స్ అమ్ముకుంటూ జీవనం గడిపేవాడు. ఇంతలో వెన్నుపూసపై కాయ ఏర్పడి అత్యవసర పరిస్థితుల్లో ఆపరేషన్ నిర్వహించారు. దీంతో నాలుగు నెలలుగా ఇంటికే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని తెలుసుకున్న అభయం యువజన సేవా సంఘం వాళ్ళు మందుల ఖర్చు నిమిత్తం రూ.10వేలు గురువారం గ్రామపెద్దల సమక్షంలో బాధితుని అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో అభయం సేవా సంఘం అధ్యక్షుడు దేవాది శ్రీనివాసరావు, సంఘ సభ్యులు యన్ సింహాచలం, పిల్లల రమేష్, ధర్మవరపు పూర్ణాచారి, ఉంగరాల గోవిందరావు, జోగి ఆదినారాయణ, గ్రామపెద్దలు పినిమింటి రామారావు, దాసరి వైకుంఠరావు, దేవాది సత్యం పాల్గొన్నారు.



## శ్రీకాకుళం అభివృద్ధిని రానున్న రోజుల్లో చూస్తారు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఎన్నడూలేని శ్రీకాకుళం అభివృద్ధిని రానున్న రోజులలో చూస్తారని, నగరాలకు దీటుగా గ్రామాలను కూడా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. సుపరిపాలన తొలి అడుగులో భాగంగా గార మండలం, కళింగపట్నం 67వ బూత్, వమరవల్లి, తొనంగి గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి, ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరిస్తూ, గ్రామాలలో చేయవలసిన పనులను పరిశీలించారు. అనంతరం గ్రామాలలో ఉండే సమస్యలను, ప్రజా సమస్యలను అడిగి, ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయో, లేదో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని, ఎటువంటి సమస్యనైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా తనకు తెలియజేస్తే, సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ గార మండల అధ్యక్ష బృందం, మండల టీడీపీ నాయకులు, గ్రామ, పంచాయతీ అధికారులు, టీడీపీ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




# మురపాకని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



**(సత్యంన్యూస్, లావేరు)**


ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మండలాల పునర్విభజనపై క్యాబినెట్ సబ్ కమిటీ వేసిన నేపథ్యంలో మురపాక కేంద్రంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో 1989లో మురపాకని మండలంగా ఏర్పాటు చేస్తూ గెజిట్ కూడా వచ్చిందని కానీ రాజకీయ కారణాలతో ఏర్పడలేదని స్థానిక శ్రీ వివేకానంద యూత్ సొసైటీ అధ్యక్షులు బాలి శ్రీనివాస నాయుడు గురువారం పేర్కొన్నారు. మురపాక పరిసర పంచాయతీల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు ప్రజలు, వ్యాపారవర్గాలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, స్థానిక యువత సహాయంతో ఉద్యమిస్తామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. గతంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టామని, ఇప్పుడు మళ్లీ అన్ని వర్గాలని కలిసి ఈ ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలని కార్యాచరణ త్వరలో ప్రకటిస్తామని ఆయన తెలిపారు. మురపాకకి మండలం ఏర్పాటు అన్ని భౌతిక మౌలిక సదుపాయాలు ఉన్నాయని మురపాక ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

**(సత్యంన్యూస్, పాతపట్నం)**

నియోజకవర్గం పాతపట్నం మండలంలో గల మేజర్ గ్రామా పంచాయతీ శివశంకర కాలనీకి చెందిన బోనెల కార్తీక్ కిడ్నీ మార్పిడి కోసం చికిత్స చేయించుకోవడానికి వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పరిస్థితిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు వివరించారు. దీంతో ఆయన ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేశారు. ఈమేరకు మంజూరైన రూ.2.56 లక్షల చెక్కును గురువారం బాధిత కుటుంబానికి ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి సకాలంలో అందజేస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# కొన్ని మెరుపులు..ఎన్నో మరకలు!

**పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్లో సుదీర్ఘ కాలం చిత్రీకరణ దశలో ఉన్న సినిమా.. హరిహర వీరమల్లు. అసలు విడుదలవుతుందా అని సందేహాలు రేకెత్తించిన ఈ చిత్రం.. అన్ని అడ్డంకులనూ దాటుకుని ఎట్టకేలకు ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మరి పవన్ అభిమానుల అంచనాలను ఈ సినిమా అందుకుందా? ఇది సగటు ప్రేక్షకులను మెప్పించేలా ఉందా? తెలుసుకుందాం పదండి.**

**కథనం-విశ్లేషణ:** సినిమా అన్నది ఒక అబద్ధం. కానీ థియేటర్లో కూర్చునే రెండు రెండున్నర గంటల పాటు ఆ అబద్ధాన్ని నిజంలా నమ్మించి.. ఓ కథలో లీనం చేయగలిగితేనే ప్రేక్షకులకు రసానుభూతి కలుగుతుంది. దాన్ని బట్టే ఆ సినిమా ఫలితం ఆధారపడి ఉంటుంది. ఐతే తెరపై జరుగుతున్నది ఏదీ నిజం కాదన్నట్లుగా ఒక భావన వెంటాడుతుంటే.. ఆ కథలో లీనం కావడం.. సన్నివేశాలను ఆస్వాదించడం చాలా కష్టంగా మారుతుంది. అందులోనూ చరిత్రతో ముడిపెట్టి ఒక కల్పిత కథను చెబుతున్నపుడు గొప్ప నైపుణ్యం చూపిస్తే తప్ప దాన్ని ప్రేక్షకులు అంగీకరించరు. అది రాజమౌళి లాంటి దర్శకులకు మాత్రమే సాధ్యమైన విద్య. కానీ రాజమౌళి స్థాయిలో కాకపోయినా క్రిష్ సైతం 'గౌతమీపుత్ర శాతకర్ణి'లో ఆ నైపుణ్యాన్ని చాటాడు. అలాంటిదే ఆయన చేసిన మరో ప్రయత్నమే.. హరిహర వీరమల్లు. మంచో చెడో ఆయనే ఈ ప్రయత్నాన్ని పూర్తి చేసి ఉండాల్సిందేమో. మధ్యలో మరో దర్శకుడు వచ్చి దీనికి తన క్రియేటివిటీని జోడించడం.. ఇంకొకరి కథకు తన విజన్ సరిపోకపోవడం.. మేకింగ్ విపరీతంగా ఆలస్యం కావడం.. విజువల్ ఎఫెక్ట్స్ ఇమడకపోవడం.. అన్నీ కలిసి 'హరిహర వీరమల్లు' ఒక అతుకుల బొంతలా తయారైంది. వేర్వేరు కాలాల్లో జీవించిన అల్లూరి సీతారామరాజు.. కొమరం భీంల పాత్రలకు ముడిపెట్టి స్వతంత్ర పోరాటం నేపథ్యంలో తాను ఒక సినిమా తీస్తున్నట్లు రాజమౌళి ప్రకటించినపుడు.. వినడానికి చాలా కృత్రిమంగా అనిపించింది. కానీ ఆ కృత్రిమమైన ఆలోచననే తెరపై అద్భుతంగా ప్రెజెంట్ చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు జక్కన్న. క్రిష్ సైతం చరిత్రకు ముడిపెడుతూ ఇలాంటి కథనే సృష్టించాడు 'హరిహర వీరమల్లు'లో. 16వ శతాబ్దంలో దేశమంతటా ఇస్లాం రాజ్య స్థాపనే లక్ష్యంగా సాగిన ఔరంగజేబుకు.. వీరమల్లు అనే హిందూ ధర్మ పరిరక్షకుడు ఎదురు నిలిస్తే ఎలా ఉం టుందనే నేపథ్యంలో ఈ కథ రాశాడు. కథానాయకుడికి దాంతో పాటు ఔరంగజేబు దగ్గరున్న కోహినూర్ వజ్రాన్ని దోచుకురావడం అనే మరో లక్ష్యాన్ని కూడా పెట్టాడు. రెంటినీ మిళితం చేసి రసవత్తర డ్రామాకు రంగం సిద్ధం చేశాడు. కానీ కథ పరంగా ఆసక్తికరంగా అనిపించినా.. ఎగ్జిక్యూషన్లో మాత్రం తేడా కొట్టేసింది. ఇది ఔరంగజేబుతో పోరాడిన శంబాజీ కథను చూపించిన 'ఛావా'లా కదిలించనూ లేదు. అదే సమయంలో కల్పిత కథతో కనికట్టు చేసిన 'ఆర్ఆర్ఆర్'లా ఉర్రూతలూగించనూ లేదు. హీరో ఎలివేషన్లు.. యాక్షన్ బ్లాక్స్ వరకు పవన్ అభిమానులను-మాస్ ప్రేక్షకులను అలరించినా.. కథనంలో ఆసక్తి లోపించడంతో సగటు ప్రేక్షకులకు నిరాశ తప్పదు. ఐతే ఓవరాల్‌గా సినిమా ఎలా ఉందన్నది పక్కన పెడితే.. 'హరిహర వీరమల్లు' హైలైట్ అనిపించే కొన్ని ఎపిసోడ్లున్నాయి. అందులో ఒకటి ఇంటర్వెల్ బ్లాక్. వందల మంది సైన్యాన్ని బోల్తా కొట్టించి వీరమల్లు బృందం వజ్రాలను కొల్లగొట్టే ఈ ఎపిసోడ్‌ను ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దింది చిత్ర బృందం. మామూలుగా మొదలై ఒక దశ వరకు అనాసక్తికరంగా అనిపించే 'వీరమల్లు'కు మంచి ఊపు తీసుకొచ్చే ఎపిసోడ్ అది. కథ పరంగా కూడా చిన్న ట్విస్ట్ ఉండడం.. కోహినూర్ వజ్రంతో ముడిపెడుతూ సాగే దాని ఫాలోఅప్ ఎపిసోడ్ కూడా బాగానే పేలింది. ఇంటర్వెల్ దగ్గర 'హరిహర వీరమల్లు' ట్రాక్ ఎక్కినట్లు అనిపిస్తుంది. కానీ ద్వితీయార్ధం కూడా అదే టెంపోతో సాగి ఉంటే సినిమా స్థాయి వేరుగా ఉండేది.

కానీ దారిలో ఎదురయ్యే రకరకాల సవాళ్లను దాటుకుంటూ దిల్లీకి వీరమల్లు తన బృందంతో ప్రయాణం చేసే క్రమంలో సాగే రెండో అర్ధం తేలిపోయింది. పవన్ కళ్యాణ్ ప్రస్తుత రియల్ లైఫ్ ఇమేజ్‌కు ముడిపెడుతూ ధర్మపరిరక్షకుడిగా ఆయన్ని ఎలివేట్ చేయడానికి చేసిన ప్రయత్నం అనుకున్నంతగా ఫలించలేదు. కొండచరియలు విరిగిపడే ఒక బ్లాక్.. వర్షం కోసం యజ్ఞం జరిపే మరో ఎపిసోడ్.. ఇవన్నీ కూడా వీఎఫెక్స్ వైఫల్యం వల్ల రియలిస్టిగ్గా అనిపించక ఫార్సుగా తయారయ్యాయి. ద్వితీయార్ధం మొత్తంలో హిందూ ధర్మాన్ని కాపాడ్డం కోసం మొఘల్ సామంత రాజుల మీద వీరమల్లు తిరగబడి జనంలో చైతన్యం తీసుకొచ్చే ఒక్క ఎపిసోడ్ మాత్రం పేలింది. ఈ కథను ఎలా ముగిస్తారు.. కోహినూర్ వజ్రం సంగతేంటి.. వీరమల్లు అసలు లక్ష్యం నెరవేరిందా.. ఔరంగజేబుతో తన పోరాటం ఎలా సాగుతుంది.. అని ఎన్నో ప్రశ్నలతో పతాక సన్నివేశాలకు సిద్ధమైతే.. దర్శకుడు జ్యోతికృష్ణ పెద్ద షాకే ఇస్తాడు. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు రెండో పార్టులో వెతుక్కోమంటూ.. పూర్తిగా అసహజంగా అనిపించే తుపాను ఎపిసోడ్‌తో క్లైమాక్సును తేల్చి పడేశాడు. ఓవరాల్‌గా కొన్ని ఎపిసోడ్ల వరకు ఎంగేజ్ చేసినా... మొత్తంగా 'హరిహర వీరమల్లు' నిరాశకే గురి చేస్తుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...


**నటీనటులు:** పవన్ కళ్యాణ్ 'హరిహర వీరమల్లు' కోసం చేయాల్సిందంతా చేశాడు. తనకే సొంతమైన 'ఆరా' సినిమాలో కొన్ని ఎపిసోడ్లను నిలబెట్టింది. ఆయనే సినిమాకు అతి పెద్ద ఆకర్షణ. వీరమల్లు పాత్రలో పవన్ లుక్ కూడా బాగుంది. ఇటు వజ్రాల దొంగగా.. అటు ధర్మ పరిరక్షకుడిగా.. రెండు రకాలుగా పవన్ మెప్పించాడు. తన పాత్రలోని రెండో కోణం ఆయన పాత్ర నిజ జీవితాన్ని గుర్తు చేస్తుంది. హీరోయిన్ నిధి అగర్వాల్ కష్టాన్ని తక్కువ చేయలేం కానీ.. ఆధునిక ఛాయలతో కనిపించే ఆమె 'పంచమి' పాత్రకు అంతగా కుదిరనట్లు అనిపించలేదు. పాత్రకు అవసరమైన పరిణతి ఆమెలో కనిపించలేదు. పవన్ పక్కన నిధికి జోడీ కూడా కుదరలేదు. ఔరంగజేబుగా బాబీ డియోల్ సరిపోయాడు. అతడి నటన కూడా బాగుంది. సత్యరాజ్.. సచిన్ ఖేద్కర్ తమ పాత్రల పరిధిలో బాగా చేశారు. సునీల్.. నాజర్.. సుబ్బరాజు.. రఘుబాబు.. వీళ్లంతా సహాయ పాత్రల్లో ఓకే అనిపించారు.

**కథ:** 16వ శతాబ్దంలో భారత దేశంలో మొఘలుల ఆధిపత్యం సాగుతున్న కాలంలో హిందూ ధర్మానికి ముప్పు వాటిల్లుతుంది. దేశమంతా ఇస్లాం మత స్థాపనే లక్ష్యంగా సాగుతున్న ఔరంగజేబు హిందూ రాజ్యాలు ఒక్కోదాన్ని చేజిక్కించుకుంటూ.. అక్కడి ప్రజలు బలవంతంగా ఇస్లాం మతం స్వీకరించేలా చేస్తుంటాడు. ఉత్తరాది నుంచి మొదలుపెట్టి దక్షిణాది వైపు అడుగులు పడతాయి. అదే సమయంలో ఇక్కడ దొంగతనాలు చేసి పేదలకు సంపదను పంచి పెట్టే వీరమల్లు (పవన్ కళ్యాణ్)కు.. ఒక భారీ దొంగతనం చేసే క్రమంలో గోల్కొండ సంస్థానానికి చెందిన నవాబు సైన్యానికి వీరమల్లు దొరికిపోతాడు. శిక్ష ఖాయమనుకున్న దశలో అతడికి నవాబు ఓ పెద్ద బాధ్యత అప్పగిస్తాడు. ఆ బాధ్యత ఏంటి.. దానికి ఔరంగజేబుకు సంబంధమేంటి.. ఇంతకీ వీరమల్లు ఎవరు.. తన నేపథ్యమేంటి.. అతడి అంతిమ లక్ష్యం ఏంటి.. ఇంతకీ అతను నవాబు చెప్పిన పని పూర్తి చేశాడా.. ఈ క్రమంలో వీరమల్లు తన లక్ష్యాన్ని సాధించాడా.. ఈ ప్రశ్నలన్నింటికీ తెర మీదే సమాధానం తెలుసుకోవాలి.

**సాంకేతిక వర్గం:** సాంకేతిక విభాగాల్లో 'హరిహర వీరమల్లు'కు అతి పెద్ద బలం కీరవాణి నేపథ్య సంగీతమే. ఆయన స్కోర్ విషయంలో శక్తి వంచన లేకుండా కష్టపడ్డారు. కథలో కీలకమైన ఎపిసోడ్లను బీజీఎంతో ఎలివేట్ చేయడానికి ప్రయత్నించారు. ఎలివేషన్.. యాక్షన్ ఎపిసోడ్లలో స్కోర్ అదిరిపోయింది. ఐతే పాటలు మాత్రం అంత గొప్పగా లేవు. ఓ మోస్తరుగా అనిపిస్తాయంతే. జ్ఞానశేఖర్.. మనోజ్ పరమహంస లాంటి పేరున్న సినిమాటోగ్రాఫర్లు ఈ సినిమాకు ఛాయాగ్రహణం అందించారు. కానీ విజువల్స్ ఇంకా మెరుగ్గా ఉండాల్సిందనిపిస్తుంది. విజువల్ ఎఫెక్ట్స్ ప్రభావం వాటి మీద పడ్డట్లు అనిపిస్తుంది. సినిమాకు వీఎఫెక్స్ అతి పెద్ద బలహీనత. చాలా సన్నివేశాలు అసహజంగా అనిపించడానికి.. ప్రభావం కోల్పోవడానికి గ్రాఫిక్స్ లోపమే ప్రధాన కారణంగా అనిపిస్తుంది. సాయిమాధవ్ బుర్రా మాటలు అక్కడక్కడా పేలాయి. క్రిష్ రాసిన కథ బాగున్నా.. అదంత ప్రభావవంతంగా తెరకెక్కలేదు. ఆయన ఎంత వరకు డైరెక్ట్ చేశారు.. జ్యోతికృష్ణ టేకింగ్ ఎంత వరకు అన్న క్లారిటీ లేదు కానీ.. కథనంలో మాత్రం నిలకడ కనిపించదు. ఏదైనా వస్తువును చాన్నాళ్లు పక్కన పడేసి బయటికి తీస్తే దుమ్ముపట్టినట్లు.. విపరీతమైన ఆలస్యం వల్లో ఏమో ఈ సినిమా కూడా ఏదో మసకబారిన ఫీలింగ్ కలుగుతుంది చూస్తున్నంతసేపు.



# ఓ అమెరికా అమ్మను మార్చేసిన
# భారత జీవనశైలి!




పొరుగింటి పుల్లకూర రుచి.. మనది కానిదేదైనా నచ్చినప్పుడు ఈ సామెతను ఎక్కడైనా ఎప్పుడైనా సందర్భాన్ని బట్టి అన్వయించుకోవచ్చు. అలా అన్వయించుకోవడమా.. లేక మన దేశానికి వచ్చి ఏకంగా ఓ పరివర్తనకే గురవ్వడమా అన్నది ఈ స్టోరీని బట్టి మీరే నిర్ణయించుకోవచ్చు. అవును.. ఓ అమెరికన్ మహిళ భారత్‌ను తెగ పొగిడేస్తున్న పోస్టొక్కటి ఇప్పుడు ఇన్‌స్టాలో తెగ వైరలవుతోంది. హిందీ నేర్చుకోవడం నుంచి శాఖాహారిగా ఆమె ఎలా మారిందో చెప్పే ఆ పోస్టుపై ఇప్పుడు భిన్నమైన స్పందనలు కనిపిస్తున్నాయి. వాటిలో ఎక్కువగా ఇండియన్స్ పాజిటివ్‌గా స్పందిస్తున్నవే.

నాలుగేళ్ల క్రితం క్రిస్టెన్ ఫిషర్ అనే మహిళ ఇండియా కొచ్చింది. అప్పట్నుంచీ తన జీవితం ఎలా మారిపోయిందో తన ఇన్‌స్టా ఖాతాలో రాసుకొచ్చింది. ప్రస్తుతం భారత్‌లో స్థిరపడ్డ ఆమె భారత్ గురించి చెబుతున్న మాటలు మన దేశం ప్రత్యేకత, వైవిధ్యాన్ని చూపిస్తుంటే.. ఇంకోవైపు, పొరుగింటి పుల్లకూర రుచి అంటూ ఎగతాళి చేసేవారూ ఉండకపోరు. భారత్‌లో స్థిరపడ్డప్పట్నుంచీ ఆమె పది ముఖ్యమైన మార్పులను గమనించినట్టు చెబుతోంది. అందుకు, మన దేశానికి హృదయపూర్వక ధన్యవాదాలంటోంది.

క్రిస్టెన్ ఫిషర్ సహజంగానే నాన్ వెజిటేరియన్. కానీ, భారత్‌కు వచ్చాక ఆమె పూర్తిగా వెజిటేరియన్‌గా మారిపోయింది. అలాగే, ఆ శాకాహారాన్ని రుచిగా వండుతుండటంతో కూడా ఆ టేస్టుకు మంత్రముగ్ధురాలై.. తానూ, ఇప్పుడు వంటలు నేర్చుకుంది.

అలాగే, ఇండియాలో జనం రోజూవారీ ట్రావెలింగ్ స్టైల్ ఫిషర్‌కు బాగా నచ్చేసిందట. యూఎస్‌లో బయటకు వెళ్లాలంటే డీఫాల్ట్‌గా కారు బయటకు తీయాల్సిందే. కానీ, ఇండియాలోనైతే.. క్యాబ్స్, రిక్షాలు, ఆటోలు, బస్సులు, మెట్రో రైళ్లు ఇలా ఎన్ని సదుపాయాలున్నాయని ఆశ్చర్యపోతోంది. అలాగే, భారత్‌లో ఎక్కడ చూసినా విరివిగా కనిపించే బైక్స్, స్కూటర్స్ చూస్తుంటే చూడముచ్చటగా ఉందట. అమెరికాలో చాలాచోట్ల అవి రోడ్లపైకి రావడమే నిషిద్ధం. అందుకే భారత్‌లో స్కూటర్‌పై తిరుగుతుంటే ఎంత హాయిగా ఉందో అంటోంది.

క్రిస్టెన్ ఫిషర్ ఇప్పుడు విదేశీ దుస్తులకు గాను.. భారతీయ సంప్రదాయ దుస్తులైన చీరలు, పంజాబీ చుడీదార్స్‌ను ధరించడం తనకు కొత్త అనుభూతినిస్తోందంటోంది. అమెరికా వంటి దేశాల్లో ట్రక్కుల్లో రవాణా చేస్తూ ఫ్రీజర్స్‌లో రోజుల తరబడి ఉండే ఆహారానికి భిన్నంగా.. భారత్‌లో తాజాగా ఎప్పటికప్పుడు లభించే పాలు, కూరగాయలు, వాటి ఉత్పత్తులు కూడా తాను ఇండియా జీవనవిధానాన్ని ఇష్టపడటానికి ప్రధాన కారణమంటోంది ఫిషర్. ముఖ్యంగా ఆకుపచ్చ రంగుల్లో తాజాగా కళ్లకింపుగా కనిపించే ఆకుకూరలు, కూరగాయల తాజాదనం ఆమెను కట్టిపడేసి.. వాటిని వండే తీరు, రుచి ఆమెకు నచ్చి ఆమె ఏకంగా ఇండియాలోనే సెటిలైపోయిందిప్పుడు.

వీటన్నింటినీ మించి ఫిషర్ హిందీ కూడా నేర్చేసుకుందట. అంటే మోడీ దృష్టిలో, భారతదేశాన్ని పాలిస్తున్న బీజేపీ దృష్టిలోనూ, హిందీని పెద్దమ్మ భాషగా అభివర్ణిస్తున్న పవన్ కళ్యాణ్ వంటివారి గుడ్ లుక్స్‌లోనూ పడే మరో ముచ్చట కూడా చెబుతోంది ఫిషర్.

భారతదేశ విద్యావ్యవస్థపై ప్రశంసలు కురిపించిన క్రిస్టెనా.. అమెరికాతో పోలిస్తే భారత్‌లో ప్రైవేట్ విద్య నాణ్యతతో పాటు, తక్కువ ఖర్చుతో కూడుకున్నదంటోంది. అందుకే, తన పిల్లలను ఓ ప్రైవేట్ స్కూల్‌కు పంపిస్తోందట. భిన్నత్వంలో ఏకత్వం అనే మాటకు తగ్గట్టుగా భారత్‌లో కనిపించే వైవిధ్యం ఆ అమెరికా అమ్మడు మన దేశాన్ని ఆకాశానికెత్తేలా చేస్తోందట.



ఇంకొన్ని ముచ్చట్లు కూడా ఆమె తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకుంది. అమెరికా కార్పోరేట్ మార్కెట్‌లకు వెళ్లితే.. ఎంత బిల్లు వేస్తే అంత చెల్లించడం మినహా బేరసారాలకు తావుండదు. కానీ, ఇండియాలో బహిరంగ మార్కెట్‌లో ఏ వస్తువు కొనుగోలైనా జరిగే బేరసారాలు కాస్త ఇంట్రెస్టింగ్ అంటోంది ఈ అమెరికన్ అమ్మడు. చివరకు వాష్ రూమ్ కల్చర్ నుంచి వంటల వరకూ ఈ అమెరికా అమ్మకు మన భరతమాత అమ్మ నచ్చిదంటూ చేసిన ఈ పోస్ట్‌పై భిన్నమైన స్పందనలు వస్తూనే ఉన్నాయి.

- బాతాఖానీ సౌజన్యంతో..





## ఎరువు సమాచారానికి
## కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో ఎరువుల సరఫరా, వినియోగంపై కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు నియంత్రణ విభాగంలో ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాధ స్వామి తెలిపారు. ఎరువుల లభ్యతపై లేదా ఇతర సంబంధిత సమాచారానికి రైతులు 91218 63788 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు. ప్రస్తుతం జిల్లాలో సరిపడినంత ఎరువుల నిల్వలు ఉన్నాయని, ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. అవసరానికి మించి ఎరువులను వినియోగించడం వల్ల నేల సారం తగ్గడంతో పాటు దిగుబడిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని, రైతులు ఆ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

## ఘనంగా అయ్యంకి జయంతి వేడుకలు



(సత్యంన్యూస్, లావేరు)

గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతి వేడుకలు గురువారం లావేరు శాఖా గ్రంథాలయంలో జరిగాయి. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకటరమణ గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేశారని, గ్రంథాలయ ఉద్యమకారుడుగా, గ్రంథాలయ పితామహుడుగా పేరు గాంచారని అన్నారు. ఈ సందర్భంగా అయ్యంకి జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు పి.సూర్యనారాయణకు ప్రథమ, ఎస్.నీలిమకు ద్వితీయ, కె.నాగరాజుకు తృతీయ బహుమతి రాగా, గ్రంథాలయాధికారి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాఠకులు పాల్గొన్నారు.

## లయన్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలిగా పైడి సింధూర
### - 27న ప్రమాణ స్వీకారం -

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం లయన్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలిగా డాక్టర్ పైడి సింధూర ఈ నెల 27న బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆమెతో పాటు 2025-26 సంవత్సరానికి ఎంపికైన కార్యవర్గం బాధ్యతలు చేపట్టనుంది. 80 ఫీట్ రోడ్డులో ఉన్న బృందావనం ఫంక్షన్ హాల్లో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రిటైర్డ్ డీజీపీ డాక్టర్ జె.పూర్ణచంద్రరావు హాజరుకానుండగా జీఎంటీ కో-ఆర్డినేటర్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డి.ఎస్.ఎస్.వి.వర్మ కొత్త అధ్యక్షురాలు, ఆఫీస్ బేరర్లతో పదవీ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. క్లబ్ సభ్యులు కె.వి.సుబ్బరాజు, నున్న శ్రీనివాసరావు, డాక్టర్ చింతాడ క్రిష్ణమోహన్, సాహు రమణ, నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్ తదితరులు అతిథులుగా పాల్గొంటారని లయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఒక ప్రకటనలో పేర్కొంది.

## 28న మెగా జాబ్‌మేళా

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాతపట్నం మహేంద్ర డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28న ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సుమారు 13 ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటాయని, 562 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగులు అర్హులని కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమ్, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో మేళా ప్రాంగణానికి రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 27న లయన్స్ హర్షవల్లి
## బాధ్యతల స్వీకారం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి నూతన కార్యవర్గ బాధ్యతల స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక కేంద్రీయ విద్యాలయ పక్కన ఉన్న ఎస్‌వీఎ గ్రాండ్ కన్వెన్షన్స్ అండ్ రిసార్ట్స్‌లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మేడిశెట్టి సత్యస్వరూప్, సెక్రటరీ సత్యవరపు లక్ష్మణరావు, ట్రెజరర్ కె.పి.రావులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మహోన్నత పోరాట యోధుడు అచ్యుతానందన్



(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)

సమసమాజం కోసం కృషి చేసిన మహోన్నత పోరాట యోధుడు అచ్యుతానందన్ అని సిటు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. కేరళ మాజీముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ సంతాప సభను చిలకపాలెం వద్ద గల నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ వద్ద సిటు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ పోరాట యోధుడు అచ్యుతానందన్ జన హృదయ నేతగా చరిత్రలో చిరకాలం నిలిచిపోతారని అన్నారు. అచ్యుతానందన్ సేవలు మరువలేని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో, నాగార్జున అగ్రికెమ్ యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, పి.సుధాకర్ బాబు, ఎల్.రామప్పడు, మాన్యం రమణ తదితరులు పాల్గొన్నారు.



# హ్యాంగ్ ఓవర్ వద్దు..!



**1997 - 2024: సాఫ్ట్‌వేర్ స్వర్ణ యుగం.. ఇంటా బయటా ఉద్యోగాల సునామీ! బాగా చదువుకున్నవారు... ఐఐటీ.. ఎన్ఐటీలు.. యావరేజ్ విద్యార్థులు.. సాదాసీదా ఇంజనీరింగ్ కళాశాలల్లో చదువుకున్నవారు కూడా బెంగళూరు, మాదాపూర్, అమెరికా, కెనడా, యూరోప్, ఆస్ట్రేలియాలలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు ఉద్యోగాలు! ఈ రంగంలో ఉద్యోగాల వెల్లువ ఎలా ఉందంటే పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయినవారు, ఇంజనీరింగ్ రెండో సంవత్సరం దాటని వారు కూడా కన్సల్టెంట్‌లను పట్టుకొని దొంగ సర్టిఫికెట్‌లతో డూప్లికేట్‌లతో పరీక్షలు రాయించి.. ఇంటర్వ్యూలు చేసి... ఉద్యోగాలు సంపాదించి విదేశాల్లో సెటిల్ అయిపోయారు.**

స్వర్ణ యుగం ముగిసింది.. కృతిమ మేధ వచ్చేసింది.. సాఫ్ట్‌వేర్ రంగంలో ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలను తినేసింది.. ఇక్కడో.. అక్కడో కాదు.. ప్రపంచమంతా! మనవాళ్లు ఇంకా హ్యాంగ్ ఓవర్‌లో.. మజ్జిగ తాగండి... మత్తు వదలండి.. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఉండవని కాదు.. ఉన్నాయి.. వస్తాయి. కానీ.. మోటార్ సైకిళ్లు.. స్కూటర్లు.. కార్లు... షేర్ ఆటోలు వచ్చేసాక.. జట్కా బండి యాపారం నడుస్తుందా? అదే హ్యాంగోవర్‌లో ఉంటే.. బతుకు జట్కాబండి అయిపోదా? కృతిమ మేధ చేసే పని.. మాత్రమే చేసే ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగాలు వస్తాయా? రావు.. ఎంత గింజుకున్నా రావు!

కృతిమ మేధ చేయలేని పని చేసేవారికే ఇక ఉద్యోగాలు. క్రియేటివిటీ, క్రిటికల్ థింకింగ్, కాలాబోరేషన్ స్కిల్స్ లాంటివి ఉన్నవారికే ఉద్యోగాలు. మనవారేమో ఒకటో తరగతి నుంచి ఇంజనీరింగ్ దాక రొడ్డకొట్టుడు.. బట్టీ చదువులు. ఇంజనీరింగ్‌లో బ్రాంచ్ ఏదైనా చెప్పేది తమకు వచ్చిన నాలుగు ముక్కలే. సీఎస్ఈ.. డీఎస్.. ఎఐఎంఎల్.. బ్రాంచ్ పేరు ఏదైనా ఆవు వ్యాసాలే.



కాలం చెల్లిన చదువులు చెప్పి.. కాపీలు కొట్టించి.. డిగ్రీలు ఇచ్చి బయటకే తోలేస్తే.. ఉద్యోగాలు వచ్చేయడానికి ఇదేమైనా సాఫ్ట్‌వేర్ స్వర్ణయుగమా?

మనం వున్నది 2025లో.. కృతిమ మేధ యుగం మొదలైపోయింది. ఇప్పటిదాక చదివిన బట్టీ చదువులు వేస్ట్. కాపీ కొట్టి తెచ్చుకొన్న డిగ్రీలు వేస్ట్. మళ్లీ బేసిక్స్ నుంచి మొదలెట్టాల్సిందే. బట్టీ చదువుల మోడ్‌లో.. ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్.. మెషిన్ లెర్నింగ్ లాంటి కోర్స్‌లు చదివినా ఉద్యోగాలు రావు. ఎందుకంటే బట్టీ రాయిళ్లు.. మహా అంటే రోబోలు చేసే పనే చేయగలుగుతారు. అదేమో వీరి కంటే లక్ష రెట్లు ఎక్కువ పని సామర్థ్యం కనబరుస్తుంది.

కింద బోసారుగా.. ఇప్పుడు ఏరుకోండి! సృజన, నాయకత్వ లక్షణాలు, సమష్టి తత్త్వం, కుశాగ్ర బుద్ధి, మెరుగైన భావ వ్యక్తీకరణ శక్తి, భావోద్వేగ.. సామాజిక తెలివితేటలు.. ఇవీ ఒక నాటి చదువులు. సాఫ్ట్‌వేర్ స్వర్ణయుగంలో వీటిని పట్టించుకొన్నవాడు లేడు. ఒక మాదిరి కళాశాలలో ఇంజనీరింగ్ చేసినా లక్షల్లో జీతం వస్తుండే.

కాలం అలాగే ఆగిపోతే బాగుండేదేమో.. కానీ.. రోబో యుగం వచ్చేసింది. ఫండమెంటల్స్ మరిచిన వారికి అశనిపాతం అయ్యింది. కార్పొరేట్ స్కూల్స్.. ఐదో తరగతి నుంచే ఐఐటీ ఫౌండేషన్ కోర్స్‌లు.. కోళ్ల ఫారాల ఇంజనీరింగ్ కళాశాలలు.. విదేశీ చదువుల ఉద్యోగాల కన్సల్టెంట్స్.. వీరి మాయ నుంచి.. తెలుగు జాతి బయటపడేది ఎప్పుడు?

డాల్లర్ల సంపాదన.. ఇండియాలో ఫ్లాట్స్. ఫ్లాట్స్ కొనుగోలు.. సంవత్సరానికి ఒక్కసారి అమెరికా ప్రయాణాలు.. అక్కడ వాకింగ్‌లో కబుర్లు.. తిరిగొచ్చాక అమెరికా గొప్పదనం గురించి డాంబికాలు.. ఈ హ్యాంగ్ ఓవర్ పోయేదెలా?

రాత్రి తాగినప్పుడు.. మస్తు మజా.. ఇప్పుడు పొద్దు పుట్టింది. తలనొప్పి.. నాలుక డ్రై.. హ్యాంగ్ ఓవర్ పోయేదెలా? ముదరబెట్టుకొంటే కిడ్నీలు పోతాయి.. ఫాటీ లివర్ వచ్చేస్తుంది. మత్తు వదలరా.. తెలుగోడా! శుభోదయం!

- వాసిరెడ్డి అమర్నాథ్















# పలకలు పీకేసేలా వేసుకోండి!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలో ప్రధాన రోడ్లలో కమర్షియల్ షాపింగ్‌లకు ముందునున్న కాలువలపై పలకలు వేసి ప్లాస్టింగ్ చేసి పూర్తి రోడ్డుగా మార్చేసి వాడుకుంటామంటే బహుశా ఇకనుంచి కుదరకపోవచ్చు. ఎందుకంటే.. కాలువల నుంచి పూడికలు తీయడం ప్రస్తుతానికి నిత్యకృత్యంగా మారింది. గతంలో ఎప్పుడో ఓసారి పూడికలు తీయడం వల్ల పలకలు తొలగించినా, ఆ తర్వాత మళ్లీ వేసుకొని వాడుకోడానికి సులువుగా ఉండేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యం ప్రొక్లయినర్లతో ప్రధాన కాలువల్లో పూడికలు తీస్తున్నారు. దీనివల్ల పలకలు వేసి ప్లాస్టింగ్‌లు చేస్తే పలుమార్లు వాటిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాలువల నుంచి ఎన్నిసార్లు షిల్ట్ తొలగించినా ప్రొక్లయినర్ బక్కెట్ దించిన ప్రతీసారి షిల్ట్ బయటకు వస్తునే వుంది. కాబట్టి ప్రధాన కాలువలకు ఆనుకొని ఉన్న షాపులు కాలువల మీద పలకలు వేయాలంటే, వాటిని సులభంగా తొలగించి, మళ్లీ వాడుకునేటట్టు నిర్మించుకోవడం



బెటర్. మున్సిపాలిటీ లేదా ఆర్ అండ్ బి రోడ్లు కలిసిన చోట కాలువల మీద పలకలను స్వయంగా మున్సిపాలిటీయే వేస్తుంది. ఇందుకోసం స్థానిక సరస్వతీ మహల్ వద్ద కల్వర్టుల మీద వేయడానికి పలకలు తయారుచేసి సిద్ధంగా ఉంచారు. ఎక్కడైతే ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే రోడ్లు ఉన్నాయో అక్కడ దానికి అనుకొని ఉన్న కాలువ గట్టును బలంగా చేసి, కొత్తగా కల్వర్టు మీద పలకలు అమరుస్తున్నారు. భవిష్యత్తులో ఈ పలకలు తొలగించుకోడానికి వీలుగా వాటికి రంధ్రాలు ఉంచుతున్నారు. ఇప్పుడు కమర్షియల్ షాపులకు ఎదురుగా ఉన్న కాలువల మీద కూడా ఇటువంటి పలకలు వేసుకోవడమే మంచిది. లేదూ అంటే.. షిల్ట్ తీస్తున్న ప్రొక్లయినర్ పలకలను ఛిన్నాభిన్నం చేసేస్తుంది.





# ఎరువే కరువయ్యేనా?

(మొదటిపేజీ తరువాయి)

సరఫరా జరగకపోవడం వల్ల జిల్లాలో ఎరువుల కొరత ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి 15 రోజులకు ఒకసారి తగినంత కేటాయింపు జరగడం లేదని అధికారులు చెబుతున్నారు. ఉత్తరాదిలో ఉన్న ప్రభుత్వ ఎరువుల కంపెనీల నుంచి రావాల్సిన కోటా రాష్ట్ర అవసరాలకు సరిపోవడం లేదనే ప్రచారం ఉంది. దీంతోపాటు కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యూనిట్ మూసివేయడం స్థానిక సరఫరాపై ప్రభావం చూపుతుందని చర్చ సాగుతుంది. తెలంగాణలోని రామగుండం ఎరువుల యూనిట్ రాష్ట్ర అవసరాలు తీర్చడంలో విఫలమైందన్న విమర్శలు ఉన్నాయి. దీనికి తోడు జిల్లాలో హోల్‌సేల్ ఎరువుల వ్యాపారులు ఇష్టానురీతిగా వ్యవహరిస్తూ అడ్డగోలు విక్రయాలు చేయడం, రైతుసేవా కేంద్రాలు, సొసైటీలకు సరఫరా చేసిన ఎరువులు పక్కదారి పట్టడమే కొరతకు కారణమనే విమర్శలు ఉన్నాయి.

### ప్రైవేటులోనే లభ్యం

జిల్లాలో ఐదుగురు హోల్‌సేల్ వర్తకులు ఉన్నారు. శ్రీకాకుళంలో గౌతం ట్రేడర్స్ పేరిట సకలాబత్తుల, ఆమదాలవలసలో వైశ్యరాజు వెంకటరాజు, టెక్కలిలో తంగుడు విష్ణమూర్తి, వైశ్యరాజు గోవిందరాజుతో పాటు మరో వ్యాపారి ఉన్నారు. వీరు రిటైల్ డీలర్లకు ఎరువులు సరఫరా చేస్తుంటారు. వీరికి 50 కేజీల యూరియా రూ.242లకు దిగుమతి అవుతుంది. వీరి నుంచి రిటైల్ వ్యాపారులు అదనంగా రూ.40 నుంచి రూ.50 చెల్లించి తరలిస్తుంటారు. వీటిని రిటైల్ వ్యాపారులు మరో రూ.50 అదనంగా ధరను ఫిక్స్ చేసి రూ.325 నుంచి రూ.350లకు విక్రయిస్తున్నారు. డీఏపీ 50 కేజీల బస్తా విషయంలోనూ ఇదే పద్ధతిని అనుసరిస్తున్నారు. రూ.1280లకు దిగుమతి చేసుకుంటున్న డీఏపీని రిటైల్‌లో రూ.1450కు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయాలంటే కాంప్లెక్స్ ఎరువులు, దుబ్బుగుళికలు, జింకును కొనుగోలు చేయాలని లింక్ పెడుతున్నారు. వీటిని కొనుగోలు చేస్తేనే డీఏపీ, యూరియాను రైతులకు ఇస్తున్నారు. రైతుసేవా కేంద్రాల్లో యూరియా 50 కేజీల బస్తా రూ.268, డీఏపీ రూ.1350కు విక్రయిస్తున్నారు. వీటితో పోల్చితే ప్రైవేట్‌లో ఒక్కో బస్తాపై అదనంగా రూ.100 వసూలు చేస్తున్నారు. వాస్తవంగా హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకుంటున్న ఎరువులను గొడౌన్లలో స్టోర్ చేయకుండా రిటైల్‌కు ఇచ్చేస్తున్నారు. జిల్లాలో ఉన్న ఐదుగురు హోల్‌సేల్ ఎరువుల వ్యాపారులకు ఎరువులు నిల్వ చేసే గొడౌన్లు లేవు. అయినా వీరు వేల టన్నుల ఎరువులను దిగుమతి చేసుకుంటూ అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

### అధికార పార్టీ నాయకులు చెప్పినవారికే ఎరువులు

జిల్లాలో ఖరీఫ్ పంటల సాగుకు అవసరమయ్యే ఎరువుల కోసం ఒక ప్రణాళికను వ్యవసాయశాఖ అధికారులు రూపొందిస్తారు. దీన్ని అనుసరించి నెలవారీ డిమాండ్ మేరకు బఫర్ స్టాక్‌ను అనుసరించి ఎరువులకు ఇండెంట్ ఇవ్వడం అనవాయితీగా వస్తుంది. జిల్లాకు కేటాయిస్తున్న ఎరువుల్లో 50 శాతం మాత్రమే రైతు సేవాకేంద్రాలు, పీఏసీఎస్‌లు, మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో యూరియా 10,583 మెట్రిక్ టన్నులు, డీఏపీ 6402, పొటాష్ 922, కాంప్లెక్స్ 3084, సూపర్ పాస్ఫేట్ 842 మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 11 నాటికి ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద యూరియా 5,692, డీఏపీ 215, ఇతర కాంప్లెక్స్ ఎరువులు 5,292 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్టు కలెక్టర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అయితే సొసైటీలు, రైతుసేవా కేంద్రాల్లో ఎరువులు దొరక్క రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయిస్తున్నారు. దీనికి కారణం సొసైటీలు, రైతుసేవా కేంద్రాలకు వచ్చిన ఎరువులను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు తరలించుకుపోయారనే ఆరోపణలు ఉన్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు సరిహద్దులు దాటించి ఒడిశాకు అక్రమంగా తరలిస్తున్నారని కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఏప్రిల్ ఒకటి నాటికి నిల్వ ఉన్న సుమారు 15,129 మెట్రిక్ టన్నుల ఎరువులు ఈ నెల 10 నాటికి సరఫరా అయ్యాయని అధికారులు చెబుతున్నా, రైతుల చెంతకు మాత్రం అరకొరగానే చేరాయని జరుగుతున్న సంఘటనలు నిరూపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న బఫర్ స్టాక్, డిమాండ్ మేరకు కావాల్సిన ఎరువుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు అధికారులు చెబుతున్నారు.

### డిమాండ్-సప్లైలో అంతరం

జిల్లాలో ఖరీఫ్‌లో సుమారు 4 లక్షల ఎకరాల్లో వరి, 30వేల ఎకరాల్లో మొక్కజొన్న, కొబ్బరి, జీడితోటలకు ఎరువులకు డిమాండ్ ఉంటుంది. వీటికి సుమారు 50వేల మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అవసరం. వరి ఎకరాకు 50 కేజీలు, మొక్కజొన్న, కొబ్బరి, జీడికి ఎకరాకు 100 కేజీలు యూరియా, డీఏపీ అవసరం. అయితే వీటిని ఖరీఫ్ ఎరువులు ప్రణాళిక ప్రకారం ప్రతి నెల డిమాండ్ మేరకు పంపిణీ చేయాలి. డిమాండ్, సప్లైలో అంతరం ఉండడంతో ఎరువులు సరఫరా సకాలంలో జరగడం లేదు. దీంతో యూరియా, డీఏపీ సరఫరాలో కొరత కారణంగా జిల్లాలలోని రైతులు ప్రైవేట్ డీలర్ల నుంచి అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తుంది. సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో వ్యవసాయ శాఖ అధికారులు చేతులెత్తేశారు. ఎరువులను అవసరానికి మించి వినియోగిస్తున్నందునే కొరత ఏర్పడుతుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఎరువుల సరఫరాపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

# భారత్‌పై చైనా వాటర్ బాంబ్!




(మొదటిపేజీ తరువాయి)

ఇటీవలే అంకురార్పణ కూడా చేసేశారు. ఇదే ఇప్పుడు భారత్, బంగ్లాదేశ్‌లకు ఆందోళన కలిగిస్తున్న అంశం. ఈ ప్రాజెక్టును భారత్‌పై చైనా ప్రయోగిస్తున్న వాటర్ బాంబ్‌గా అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి ఫెమా ఖండూ అభివర్ణించారంటేనే.. ఈశాన్య భారతంలోని చైనా సరిహద్దు రాష్ట్రాలపై అది ఎంత తీవ్ర ప్రభావం చూపుతుందో అర్థం చేసుకోవచ్చు. సరిహద్దుకు సమీపంలో బ్రహ్మపుత్ర నదిపై భారీ హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించడం భారత్‌ను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టడమేనని ఆస్ట్రేలియన్ స్ట్రాటజిక్ పాలసీ ఇన్‌స్టిట్యూట్ (ఏఎస్‌పీ) కూడా హెచ్చరించింది. ఈ సూపర్ డ్యామ్ భారత్‌కు అన్ని విధాల ముప్పుగా పరిణమిస్తుందని పేర్కొంది. ఆ నది భారత్‌లోకి ప్రవేశించే ముందు వంపు తిరిగి 300 మీటర్ల దిగువన ఉన్న లోయ వంటి ప్రాంతంలోకి ప్రవహిస్తుంది. సరిగ్గా అదే ప్రదేశంలో చైనా వ్యూహాత్మకంగా ఈ సూపర్ డామ్‌ను నిర్మిస్తోంది. దీనివల్ల నిర్మిస్తే ఖర్చు తగ్గడమే కాకుండా వ్యూహాత్మకంగా పొరుగు దేశాలను కష్టాల్లోకి నెట్టవచ్చన్నది చైనా కుటిల యోచన.

### ఒప్పందం మాటేమిటి?

చైనా ఆధిపత్యం కింద ఉన్న టిబెట్ పరిధిలోని హిమాలయ సానువుల్లో హిమానినదం నుంచి ఐదువేల మీటర్ల ఎత్తున పుట్టిన బ్రహ్మపుత్ర నది అక్కడి నుంచి భారత్, బంగ్లాదేశ్ మీదుగా 2900 కి.మీ. దూరం ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తుంది. చైనాలో దీన్ని యార్లాంగ్ సాంగ్పో నదిగా, భారత్‌లో బ్రహ్మపుత్రగా, బంగ్లాదేశ్‌లో జమునా నది పేరుతో ప్రాచుర్యం పొందింది. ఈ నదీజలాల వినియోగంపై తొలిసారి భారత్, చైనా మధ్య ఒప్పందం కుదిరింది. 2008, 2013, 2018లలో దాన్ని పునరుద్ధరించారు. చివరిసారిగా చేసుకున్న ఒప్పందం కాలపరిమితి 2023లో ముగిసింది. ఆ తర్వాత ఇరుదేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతల వల్ల ఆ ఒప్పందాన్ని పునరుద్ధరించలేదు. దాంతో ఎగువ దేశం హోదాలో చైనా దిగువ దేశాలైన భారత్, బంగ్లాదేశ్‌లతో సంప్రదించకుండానే బ్రహ్మపుత్రపై ఏకపక్షంగా ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టింది. సుమారు 1.2 ట్రిలియన్ యువాన్లు అంటే.. భారత కరెన్సీలో రూ.14.50 లక్షల కోట్లతో దీన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం ఐదు జలవిద్యుత్ కేంద్రాలు నిర్మిస్తారు. ఈ మొత్తం ప్రాజెక్టు గతంలో చైనాలోనే యాంగ్ త్సే నదిపై రికార్డు స్థాయిలో నిర్మించిన త్రీగోర్జెస్ డ్యామ్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్ కంటే మూడురెట్లు అధిక విద్యుత్‌ను బ్రహ్మపుత్ర సూపర్ డ్యామ్ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి చేస్తారు. దీని ద్వారా 300 బిలియన్ కిలోవాట్ల (60 గిగావాట్లు) విద్యుత్ ఉత్పత్తి కానుంది. 2060 నాటికి వాతావరణ కాలుష్యాన్ని అరికట్టాలన్న లక్ష్యాన్ని సాధించే రెన్యూవబుల్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులో దీన్నో భాగంగా



చైనా తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా టిబెట్ స్వయంపాలిత ప్రాంతానికి మూడు బిలియన్ డాలర్ల వార్షికాదాయం సంపాదించిపెట్టడం కూడా చైనా మరో లక్ష్యం.

### భూకంపాలకు ఆస్కారం

ఈ ప్రాజెక్టు ద్వారా ఏ లక్ష్యాలను చైనా సాధించాలనుకుంటుందన్నది పక్కన పెడితే.. దీని వల్ల భౌగోళికంగా, వ్యవసాయకంగా, జీవవైవిధ్యపరంగా వాటిల్లే నష్టాలే చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టు వల్ల నదీపరివాహక దేశాలైన భారత్, బంగ్లాదేశ్‌తోపాటు ప్రాజెక్టు నిర్మిస్తున్న టిబెట్‌కు కూడా పెనునష్టం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతమైన టిబెట్ పీఠభూమి హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఉంది. హిమవత్పర్వత ప్రాంతాలన్నీ సిస్మిక్ జోన్‌లో ఉన్నాయన్నది ఎప్పుడో నిపుణులు తేల్చిన విషయం. అంటే ఈ జోన్‌లో భూమి పొరల్లో ఉంటే టెక్టానిక్ ప్లేట్లు తరచూ కదలికలకు గురవుతుండటం వల్ల భూ ప్రకంపనలు సంభవిస్తుంటాయి. వీటి ప్రభావంతో హిమాలయాల్లో పుట్టి ప్రవహించే హిమాని నదాలు, బ్రహ్మపుత్ర, సింధూ లాంటి నదుల్లో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉంటుంది. అలాంటి చోట అతిభారీ పవర్ ప్రాజెక్టు నిర్మిస్తే ఆ ప్రభావం భూమిపై చాలా తీవ్రంగా ఉండి పెను విధ్వంసం జరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్లే టిబెట్ ప్రజలు కూడా ఈ హైడ్రో ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు.

### వరదలు సృష్టించే అవకాశం

ఈ ప్రాజెక్టు ద్వారా భారత్‌లో ఆకస్మిక వరదలు, అలాగే అనావృష్టి పరిస్థితులు సృష్టించే అవకాశం చైనాకు లభిస్తుంది. భారత సరిహద్దుకు కేవలం 30 కి.మీ దూరంలోనే నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా దిగువకు నీటిని నిలిపివేస్తే మన దేశంలోని అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో తీవ్ర నీటికొరత ఏర్పడుతుంది. దానివల్ల తాగునీటి ఇబ్బందులతోపాటు వ్యవసాయం కూడా కష్టాల్లో పడుతుంది. మరోవైపు వర్షాకాలంలో నది వరద నీటితో ఉప్పొంగుతుంది. అలాంటి సమయాల్లో ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా ఈ డ్యామ్ నుంచి ప నీటిని దిగువకు వదిలేస్తే అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం లాంటి భారత రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌లో కూడా జల ప్రళయం సంభవిస్తుంది. ప్రస్తుతం బ్రహ్మపుత్ర నదికి సంబంధించి ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం అమల్లో లేనందున వరదనీటి విడుదల వంటి సమాచార మార్పిడి జరగదు. అధిక నీటిని విడుదల చేస్తున్నట్లు ఎందుకు చెప్పలేదని చైనాను అడిగే హక్కు మనదేశానికి ఉండదు. అలాగే చైనా దుష్ట పన్నాగాలను అంతర్జాతీయ వేదికలపై ఎండగట్టే అవకాశం కూడా భారత్‌కు ఉండదు.

### మరెన్నో నష్టాలు

-హైడ్రో పవర్ ప్రాజెక్టు కోసం నిర్మిస్తున్న డ్యాములు ఎగువ నుంచి వచ్చే మట్టి దిగువకు వెళ్లకుండా అడ్డుకుంటాయి. దాంతో దిగువ పరీవాహక ప్రాంతాల్లోని భూములు కొంతకాలానికి నిస్సారంగా మారి వ్యవసాయ దిగుబడులను దెబ్బతీస్తాయి.

-అద్భుతమైన పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి ఆలవాలంగా ఉన్న హిమాలయన్ రీజియన్‌లో అవన్నీ దెబ్బ తింటాయి. పరీవాహక ప్రాంతాల్లో అడవుల నాశనం, భూమి కోత, వాతావరణ మార్పులు వంటి అనర్థాలు పెరుగుతాయి.

-డెల్టా ప్రాంతాల్లో నదీ ప్రవాహం ఒక క్రమపద్ధతి లేకుండా పెరిగి సముద్ర మట్టాన్ని దాటే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పట్టణంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా వాహన దారులు నిబంధనలు పాటించాలని ఎస్సై-2 కాంతా రావు అన్నారు. గురువారం పట్టణంలో ప్రధాన కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. అలాగే వాహనాలను నిలుపుచేసేటప్పుడు ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిలుపుచేయాలన్నారు. ఆయనతో సిబ్బంది పాల్గొన్నారు.




## ఇన్‌కమ్ టాక్స్‌పై అవగాహన కార్యక్రమం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జాతీయ ఆదాయపు పన్ను దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదాయ శాఖ వారి ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక పిఎన్ కాలనీలో గల న్యూ సెంట్రల్ స్కూల్లో పిల్లలకు ఇన్‌కమ్ టాక్స్ పైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇన్కమ్ టాక్స్ ఆఫీసర్ రవిశంకర్ హాజరై విద్యార్థులకు ఇన్కమ్ టాక్స్ పైన ఏవిధంగా ఉపయోగపడుతుంది. అది దేశానికి ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశాలపై వివరించారు. పాఠశాల వ్యవస్థాపకులు ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన్‌రావు ఈ కార్యక్రమానికి హాజరై ఇన్‌కమ్ టాక్స్ సరైన సమయంలో పే చేయడం వల్ల దేశానికి ఎంతో సేవ చేసిన వాళ్ళు అవుతారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, చార్టెడ్ అకౌంటెంట్ కనుగుల దుర్గాశ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హరిహర వీరమల్లు వీక్షించిన జన సైనికులు




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జనసేనపార్టీ అధ్యక్షులు, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నటించిన హరిహర వీరమల్లు చిత్రాన్ని జిల్లాకు చెందిన జనసైనికులు బుధవారం రాత్రి వీక్షించారు. ఈమేరకు జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆధ్వర్యంలో పొందూరు కేవీఆర్ థియేటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జనసేనాని పవన్‌కళ్యాణ్ ప్రజలకు స్ఫూర్తిదాయకమైన చిత్రాన్ని అందించారన్నారు. అందుకే ప్రతీ ఒక్కరు సకుటుంబసమేతంగా సినిమాను చూసి భారత ప్రాచీన చరిత్రను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

## ఘనంగా అయ్యంకి జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య 135వ జయంతిని బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేను పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో గ్రంథాలయ వ్యవస్థ ఉన్నంతకాలం గుర్తుండే పేరు అయ్యంకి వెంకటరమణయ్య అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమానికి సమానంగా గ్రంథాలయ ఉద్యమాన్ని నడిపి గ్రంథాలయాల ప్రాధాన్యతను పుస్తకాల విలువలను మానవాళికి చాటి చెప్పిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో సహాయకురాలు కె.అనిత పాఠకులు తదితరులు పాల్గొన్నారు



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.